క్లుప్తంగా

సకాలంలో రుణాలు చెల్లించాలి



సదాశివనగర్: గ్రామ సంఘాల సభ్యులు తీసుకున్న రుణాలను సకాలంలో చెల్లించి సంఘాల అభివృద్ధికి కృషి చేయాలని డీపీఎం సుధాకర్ సూచించారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో ఓటర్ల సర్వే ప్రకారం కొత్త సంఘాల ఏర్పాటు, తేనెటీగల పెంపకం, వృద్ధుల సంఘాల ఏర్పాటు, చేపల పెంపకంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మండల సమాఖ్య అధ్యక్షురాలు కుంట రజిత, ఏపీడీ మురళీ, సీసీలు లింగం, రాములు, ఆంజనేయులు, నరేందర్‌రెడ్డి, కృష్ణాంజలి పాల్గొన్నారు.

పాడి రైతులకు శిక్షణ



భిక్కనూరు: రిలయన్స్ ఫౌండేషన్ సంస్థ ఆధ్వర్యంలో ఇవ్వనున్న శిక్షణ కోసం భిక్కనూరు, మాచారెడ్డి,గాంధారీ, కామారెడ్డి, లింగంపేట్, భిచ్కుంద, రామారెడ్డి, తాడ్వాయి మండలాలకు చెందిన పలువురు పాడి రైతులు బుధవారం హైదరాబాద్ వెళ్లారు. పాడి అభివృద్ధికి తీసుకోవాల్సిన చర్యలు తదితర వాటిపై అవగాహన కల్పిస్తారని తెలిపారు. రైతులతో పాటు రిలయన్స్ ఫౌండేషన్ ప్రాజెక్టు ఆఫీసర్ శ్వేతా చరణ్య, ప్రోగ్రాం ఇన్‌చార్జిలు భూపతి, సతీషు, ముకుంద ఉన్నారు.

ఎల్లారెడ్డికి చేరిన బైక్ ర్యాలీ



ఎల్లారెడ్డిరూరల్: సీఎస్ఐ చర్చిలను సందర్శిస్తున్న యువకుల బైక్ ర్యాలీ బుధవారం ఎల్లారెడ్డికి చేరుకుంది. పట్టణంలోని ఏద వర్షిప్ చర్చిలో వారు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. నిజామాబాద్ జిల్లాలోని దూదిగాంకు చెందిన పలువురు యువకులు బైక్ ర్యాలీ ద్వారా చర్చిల సందర్శనలో భాగంగా మెదక్ సీఎస్ఐ చర్చి సందర్శించుకున్న అనంతరం తిరుగు ప్రయాణంలో ఏద వర్షిప్ చర్చిని సందర్శించి ప్రత్యేకంగా ప్రార్థనలు నిర్వహించినట్లు సిస్టర్ లీనా హెప్సీబా తెలిపారు.

అటవీ సంరక్షణకు ఫైర్‌లైన్ ఏర్పాటు



నస్రుల్లాబాద్: అటవీ సంరక్షణకు ఫైర్‌లైన్ ఏర్పాటు చేస్తున్నట్లు అటవీశాఖ అధికారి రమాకాంత్ వెల్లడించారు. వేసవి కాలంలో ప్రమాదవశాత్తు జరిగే అగ్ని ప్రమాదంలో అడవిలోని చెట్లు కాలి పోకుండా ఫైర్‌లైన్ ఏర్పాటు చేస్తున్నామని పేర్కొన్నారు.

గురుకుల విద్యాలయాన్ని తనిఖీ చేసిన ఎంపీపీ



బాన్సువాడ రూరల్: మండలంలోని బోర్లం క్యాంపు తండాలో ఉన్న సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ గురుకుల విద్యాలయాన్ని బుధవారం ఎంపీపీ నిరజారెడ్డి తనిఖీ చేశారు. విద్యార్థులకు అందిస్తున్న అల్పాహారాన్ని పరిశీలించారు. గురుకుల విద్యాలయంలో నెలకొన్న సమస్యలను ప్రిన్సిపల్ పద్మకుమారిని అడిగి తెలుసుకున్నారు. ఆమె వెంట సర్పంచ్ నాన్కు పీర్యానాయక్,ఉపసర్పంచ్ సాయిలు ఉన్నారు.

తిప్పాపూర్ తొలి ఉపాధ్యాయుడి మృతి



రాఘవేందర్ రావు (ఫైల్)

భిక్కనూరు: మండలంలోని తిప్పాపూర్ గ్రామ తొలి ఉపాధ్యాయుడు వైద్య రాఘవేందర్‌రావు (92) బుధ వారం మృతి చెందాడు. 1958లో ప్రభుత్వ ఉపాధ్యాయుడిగా ఉద్యోగం పొందిన ఆయన తన స్వంత గ్రామమైన తిప్పాపూర్ ప్రాథమిక పాఠశాలలోనే విధుల్లో చేరాడు. అనంతరం అదే పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడిగా కూడా పని చేసినట్లు స్థానికులు తెలిపారు.

పనితీరు మెరుగుపర్చుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి



సమావేశానికి హాజరైన ప్రజాప్రతినిధులు

- ఏఈవోలు గ్రామాల్లో తిరగాలి
- వ్యవసాయ శాఖ సిబ్బందితో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేయాలి
- కూర్చొన్న చోట నుంచే పంట వివరాల నమోదు చేస్తే ఎలా
- మండల సర్వసభ్య సమావేశంలో స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి

బాన్సువాడ టౌన్: వ్యవసాయ, ఇరిగేషన్ అధికారులు పనితీరు మెరుగు పర్చుకోవాలని స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి సూచించారు. బుధవారం స్థానిక మండల పరిషత్‌లో కార్యాలయంలో బుధవారం ఎంపీపీ నీరజావెంకట్‌రాంరెడ్డి అధ్యక్షతన నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశానికి స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా వ్యవసాయాధికారి కమల పంట సాగు వివరాలను చదివి వినిపించారు. హన్మజిపేట్ ఎంపీటీసీ సుధాకర్‌రెడ్డి మాట్లాడుతూ వ్యవసాధికారులు తప్పుడు సమాచారం చెబుతున్నారని, ఒక్క కాద్లాపూర్‌లోనే 50 ఎకరాల్లో చెరువు సాగవుతుందని అన్నారు. 16 కేవీ ట్రాన్స్‌ఫార్మర్లను 25 కేవీ ట్రాన్స్‌ఫార్మర్లుగా మార్చాలని అన్నారు. స్పీకర్ మాట్లాడుతూ దీన్ని బట్టి ఏఈవోలు గ్రామాల్లో తిరగడం లేదని, కూర్చొన్న చోటే పంటల సాగు వివరాలు నమోదు చేస్తున్నారని బీర్కూర్, బాన్సువాడ, నస్రుల్లాబాద్ మండలాల ఏఈవోలతో వెంటనే సమావేశం ఏర్పాటు చేయాలని ఏడీఏ వినయ్‌కుమార్‌రెడ్డిని స్పీకర్ ఆదేశించారు. మండలంలోని రాంపూర్ చెరువును ఎప్పుడైన సందర్శించారా అని ఇరిగేషన్ డీఈ జగదీష్‌ను స్పీకర్ ప్రశ్నించగా లేదని సమాధానం ఇచ్చారు.

బాన్సువాడ మండలానికి రైతు బంధు పథకం ద్వారా రెండు పంటలకు రూ.19 కోట్లు, రైతు బీమా ద్వారా చనిపోయిన రైతు కుటుంబాలకు కు రూ.14 కోట్లు వచ్చాయని అన్నారు. ట్రైబల్ వెల్ఫేర్ పథకం ద్వారా కాలునాయక్ తండా నుంచి పులిగుండు తండా వరకు బీటీ రోడ్డు వేసేందుకు రూ.కోటి, చత్రునాయక్ తండా రోడ్డుకు రూ.80 లక్షలు, కాద్లాపూర్ తండా రోడ్డుకు రూ.40 లక్షలు, వెంకటేశ్వర తండా రోడ్డుకు రూ.60 లక్షలు, రేకులకుంట తండాకు రూ. 2.10 కోట్లు మంజూరైనట్లు వెల్లడించారు. వివిధ అభివృద్ధి పనుల కోసం బాన్సువాడ నియోజకవర్గానికి రూ.100 కోట్లు మంజూరు అయ్యాయని, పాత పనులు పూర్తి చేసిన తర్వాత కొత్త పనులకు టెండర్లు నిర్వహించాలని పీఆర్ ఈఈకి సూచించారు. నియోజకవర్గంలో డబుల్ లేన్ రోడ్లు ఉన్నాయని, ఎల్లారెడ్డి నుంచి బాన్సువాడ మీదుగా రుద్రూర్ వరకు జాతీయ రహదారికి ఏర్పాటుకు రూ.260 కోట్లు మంజూరు అయ్యాయని, పనులు త్వరలో ప్రారంభం అవుతాయని వెల్లడించారు. సమావేశంలో జెడ్పీటీసీ పద్మ, వైస్ ఎంపీపీ హరిసింగ్, మున్సిపల్ చైర్మన్ జంగం గంగాధర్, సహకార సంఘం అధ్యక్షుడు కృష్ణారెడ్డి, డీసీసీబీ డైరెక్టర్ సంగ్రాంనాయక్ తదితరులు పాల్గొన్నారు.

చెక్కుల పంపిణీ

నియోజకవర్గంలోని రుద్రూర్, వర్ని, బీర్కూర్, కోటగిరి, నస్రుల్లాబాద్, బాన్సువాడ మండలాలకు చెందిన పలువురు లబ్ధిదారులకు కల్యాణలక్ష్మీ, షాదీ ముబారక్ చెక్కులను స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి పంపిణీ చేశారు. ఆడ పిల్లల తల్లిదండ్రులకు వారి పెళ్లి భారం కాకూడదని సీఎం కేసీఆర్ ఆ పథకాల ద్వారా రూ. లక్ష ఆర్థిక సహాయం చేస్తున్నారని పేర్కొన్నారు.

హామీలను తుంగలో తొక్కిన సీఎం



పర్మళ్లలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే రవీందర్‌రెడ్డి



లింగారెడ్డిపేటలో..

లింగంపేట: ఎన్నికల ముందు సీఎం కేసీఆర్ ఇచ్చిన హామీలను అమలు చేయకుండా తుంగలో తొక్కారని మాజీ ఎమ్మెల్యే ఏనుగు రవీందర్‌రెడ్డి ఆరోపించారు. బుధవారం ఆయన మండలంలోని పర్మళ్ల గ్రామంలో ఏర్పాటు చేసిన ప్రజాగోస, బీజేపీ భరోసా కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ నిరుద్యోగ భృతి, బీడీ కార్మికులకు పెన్షన్లు, దళితులకు 3 ఎకరాల భూమి ఇస్తామని ఎన్నికల్లో చెప్పిన కేసీఆర్ తర్వాత వాటిని అమలు చేయడం లేదన్నారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ పథకాలను ప్రజలకు వివరిస్తున్నట్లు వెల్లడించారు. మండల బీజేపీ అధ్యక్షుడు దత్తురాం, ఓబీసీ జిల్లా అధ్యక్షుడు మహారాజుల మురళి తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రంలో రానున్నది బీజేపీ పాలన

ఎల్లారెడ్డి: రాష్ట్రంలో బీజేపీ పాలన రానున్నదని మాజీ ఎమ్మెల్యే ఏనుగు రవీందర్‌రెడ్డి అన్నారు. బుధవారం లింగారెడ్డిపేటలో నిర్వహించిన సమావేశంలో గ్రామాల్లో బీజేపీ పటిష్టతకు కృషి చేయాలని కార్యకర్తలకు సూచించారు. అనంతరం మండల బీజేపీ ప్రధాన కార్యదర్శిగా గొలపల్లి మల్లేషను నియమించారు. నాయకులు సామెల్, దేవేందర్, బాలకిషన్, ప్రశాంత్‌గౌడ్ పాల్గొన్నారు.

రాష్ట్ర ప్రభుత్వానికి బుద్ధి చెప్పాలి

తాడ్వాయి: అవినీతిలో కూరుకు పోయిన రాష్ట్ర ప్రభుత్వానికి వచ్చే ఎన్నికల్లో గట్టిగా బుద్ధి చెప్పాలని కేంద్ర బొగ్గు గనుల డైరెక్టర్ మురళీధర్ గౌడ్ అన్నారు. మండలంలోని సంగోజీవాడిలో మంగళవారం రాత్రి నిర్వహించిన ప్రజాగోస బీజేపీ భరోసా కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో కుటుంబ పాలనను అంతమొందించాలని సూచించారు. కార్యక్రమంలో నాయకులు బాపురెడ్డి, రవీందర్ రావ్, వెంకట్ రావ్, హోటల్ శ్రీను, లింగారావ్, నర్సారెడ్డి, రాజేశ్వర్ రెడ్డి, ఆనంద్ రావ్ పాల్గొన్నారు.

కేంద్ర పథకాలు ప్రజలకు వివరించాలి

నస్రుల్లాబాద్: కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని బీజేపీ నాయకులు కార్యకర్తలకు సూచించారు. మండలంలోని మైలారం గ్రామంలో బుధవారం నిర్వహించిన బీజేపీ కార్నర్ మీటింగ్‌లో బాన్సువాడ నియోజకవర్గం ఇన్‌చార్జి మాల్యాద్రి రెడ్డి మాట్లాడుతూ ప్రజలకు అందుతున్న ప్రతి పథకానికి కేంద్రం నిధులు ఇస్తోందన్నారు. బీజేపీ మండల అధ్యక్షుడు హన్మండ్లు, కూనింటి రాము, సతీష్ పాల్గొన్నారు.

ఎన్నికలే లక్ష్యంగా పనిచేయాలి

బాన్సువాడ రూరల్: రానున్న ఎన్నికలే లక్ష్యంగా నాయకులు, కార్యకర్తలు పనిచేయాలని బీజేపీ బాన్సువాడ అసెంబ్లీ కన్వీనర్ భాస్కర్ కోరారు. మండలంలోని కొత్తాబాదిలో బుధవారం నిర్వహించిన ప్రజాగోస బీజేపీ భరోసా స్ట్రీట్ సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యాల గురించి ప్రజలకు వివరించాలన్నారు. సమావేశంలో ఆ పార్టీ మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి సాయిబాబ, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.



సంగోజీవాడిలో మురళీధర్ గౌడ్..



బాన్సువాడ మండలం కొత్తాబాదిలో..

మద్దతు ధరకు శనగ కొనుగోలు



పిట్లంలో కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ప్రజాప్రతినిధులు



గాంధారిలో..

పిట్లం: శనగ కొనుగోలు కేంద్రాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని సహకార సంఘం చైర్మన్ శప్తం రెడ్డి పేర్కొన్నారు. బుధవారం స్థానిక వ్యవసాయ మార్కెట్ కమిటీలో మార్క్‌ఫెడ్ ఆధ్వర్యంలో శనగ కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శనగకు మద్దతు ధర క్వింటాల్ రూ. 5,335 ప్రభుత్వం నిర్ణయించిందని, ఆ మేరకు కొనుగోలు చేయనున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ అరికెల శ్రీనివాస్ రెడ్డి, డీసీసీబీ డైరెక్టర్ సాయిరెడ్డి, సర్పంచ్ జొన్న విజయరెడ్డి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు రమేష్, సీఈవో సంతోష్ రెడ్డి పాల్గొన్నారు.

గాంధారి: శనగల కొనుగోలు కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలని జెడ్పీటీసీ శంకర్ నాయక్, ఇతర ప్రజాప్రతినిధులు రైతులకు సూచించారు. బుధవారం స్థానిక వ్యవసాయ మార్కెట్ కమిటీ యార్డులో శనగ కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో సర్పంచ్‌ల ఫోరం మండల అధ్యక్షుడు సంజీవు, విండో వైస్ చైర్మన్ ఉద్దల్‌సింగ్ పాల్గొన్నారు.

నియామకం..

బీఆర్ఎస్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి..



మద్నూర్: బీఆర్ఎస్ మండల అధ్యక్షుడిగా లచ్చన్‌కు చెందిన బస్సీపటేల్, ప్రధాన కార్యదర్శిగా మేనూర్‌కు చెందిన గోవింద్‌ను నియమించారు. కొత్తగా డోంగ్లీ మండలం ఏర్పడటంతో రెండు మండలాలకు ఎమ్మెల్యే హన్మంత్ సింధే సమానంగా పదవులు కేటాయించినట్లు నాయకులు వెల్లడించారు.

మార్కెట్ కమిటీ చైర్మన్ ఎన్నిక



సంగమేశ్వర్

మద్నూర్: మద్నూర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్‌గా కోడిచిర గ్రామానికి చెందిన బోలేవార్ సంగమేశ్వర్‌ను నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతుల శ్రేయస్సు కోసం అహర్నిషలు కృషి చేస్తానని పేర్కొన్నారు.

దేశం కోసం యువత పాటుపడాలి



అగ్నిపథ్‌కు ఎంపికైన యువకుడిని సన్మానిస్తున్న జెడ్పీటీసీ తిర్మల్‌గౌడ్, సర్పంచ్ అంజలి

దోమకొండ: అగ్నిపథ్‌కు ఎంపికైన మండల కేంద్రానికి చెందిన సాయిబ్‌గారి నవీన్‌ను కామారెడ్డి డీఎల్‌పీవో సాయిబాబా బుధవారం సన్మానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ దేశం కోసం యువత ముందుండాలన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యులు తీగల తిర్మల్‌గౌడ్,సర్పంచ్ నల్లపు అంజలి, ఎంపీడీవో చిన్నారెడ్డి, ఎంపీవో తిరుపతిరెడ్డి పాల్గొన్నారు.

పెద్దకొడప్‌గల్: మండలంలోని పెద్ద దేవిసంగ్ తండా, వడ్లం గ్రామానికి చెందిన బామాన్ సజాన్ లాల్, భావుసింగ్, ప్రవాణ్, నాగరాజు అనే యువకులు అగ్నిపథ్‌కు ఎంపిక కావడంతో వారిని స్థానికుల సహకారంతో జెడ్పీ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు సన్మానించారు. పాఠశాల హెచ్ఎం రామాంజనేయులు మాట్లాడుతూ మారుమూల ప్రాంతాల నుంచి దేశసేవలో సైనికులుగా చేరడం అభినందనీయం అన్నారు.

సమాచారం..

నేటి నుంచి ఇళ్ల కోసం దరఖాస్తుల ఆహ్వానం

భిక్కనూరు: మండలంలోని రామేశ్వర్‌పల్లి, కాచాపూర్, పెద్దమల్లారెడ్డి గ్రామాల్లో నిర్మించిన డబుల్ బెడ్రూం ఇళ్ల కోసం నిరుపేదల నుంచి 26వ తేదీ వరకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు తహసీల్దార్ ప్రేమ్‌కుమార్ తెలిపారు. గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద వీఆర్ఏలకు దరఖాస్తు ఇవ్వాలని సూచించారు. దరఖాస్తుకు ఆధార్‌కార్డు, రేషన్‌కార్డు జిరాక్స్ ప్రతులు ఇవ్వాలన్నారు.

25న మండల సర్వసభ్య సమావేశం

కామారెడ్డి రూరల్ : మండల సర్వసభ్య సమావేశం 25న ఎంపీపీ పిప్పిరి ఆంజనేయులు అధ్యక్షతన నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో శంకర్ నాయక్ తెలిపారు. సమావేశానికి మండలంలోని ఎంపీటీసీ సభ్యులు, సర్పంచులు, అధికారులు సకాలంలో హాజరుకావాలని కోరారు.

కాంగ్రెస్‌లో చేరిన బీఆర్ఎస్ నాయకులు



కాంగ్రెస్ కండువా కప్పుకున్న బీఆర్ఎస్ నాయకులు

సదాశివనగర్: మండలంలోని ధర్మారావ్‌పేట్, అమర్లబండ గ్రామాలకు చెందిన పలువురు బీఆర్ఎస్ నాయకులు బుధవారం కాంగ్రెస్ ఐటీ సెల్ చైర్మన్ మదన్‌మోహన్ రావు సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు.అమర్లబండకు చెందిన ఉప సర్పంచ్ భర్త మహేశ్, బీఆర్ఎస్ మండల యూత్ అధ్యక్షుడు సంతోష్‌రెడ్డి, బాలశేఖర్, బీఆర్ఎస్ ధర్మారావ్‌పేట్ యూత్ అధ్యక్షుడు నవీన్‌రావు, ద్యాగరి సంతోష్‌రెడ్డి తదితరులకు మదన్‌మోహన్ రావు కాంగ్రెస్ కండువాను కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు లింగాగౌడ్, వైస్ ఎంపీపీ గాదారి శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బయోసైన్స్ టాలెంట్ టెస్ట్‌లో ప్రతిభ



ఎల్లారెడ్డిరూరల్: మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు స్థానిక జెడ్పీ బాలికల ఉన్నత పాఠశాలలో బయోసైన్స్‌లో బుధవారం టాలెంట్ టెస్టు నిర్వహించారు. మండలంలోని మోడల్ స్కూల్ విద్యార్థిని సహస్ర, కళ్యాణి జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థి హరీష్ ప్రథమ, ద్వితీయ స్థానం సాధించారు. జిల్లా స్థాయిలో నిర్వహించే టాలెంట్ టెస్టుకు వారిని ఎంపిక చేసినట్లు ఉపాధ్యాయులు రమేష్, వనజ, అనిల్, దేవేందర్ తెలిపారు.

అబుల్ కలాం ఆజాద్‌కు నివాళి



అబుల్ కలాం చిత్రపటం వద్ద రాజేశ్వర్

కామారెడ్డి అర్బన్: దేశ తొలి విద్యాశాఖ మంత్రి మౌలానా అబుల్ కలాం ఆజాద్ వర్ధంతి సందర్భంగా బుధవారం జిల్లా గ్రంథాలయంలో గ్రంథాలయ సంస్థ చైర్మన్ పి.రాజేశ్వర్ ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సంస్థ సిబ్బంది, పాఠకులు పాల్గొన్నారు.

జీవాలకు నట్టల మందు తప్పనిసరి



చిట్యాలలో మందు వేస్తున్న ఏడీ సంజయ్

తాడ్వాయి: గొర్రెలు, మేకలకు ఉచితంగా నట్టల నివారణ మందు పంపిణీ చేస్తున్నట్లు పశుసంవర్ధక శాఖ ఏడీ సంజయ్ తెలిపారు. 28వ తేదీ వరకు జిల్లాలోని అన్ని గ్రామాలలో మందు పంపిణీ చేయనున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో సర్పంచ్ కవిత, ఎంపీటీసీ రాజమణి, మండల పశువైద్యాధికారి రాంచంద్రం పాల్గొన్నారు.

నస్రుల్లాబాద్(బీర్కూర్): బీర్కూర్, నస్రుల్లాబాద్ మండలంలోని పలు గ్రామాల్లో ఉచితంగా నట్టల మందులను పంపిణీ చేశారు. ఎంపీపీ రఘు మాట్లాడుతూ నట్టల మందు వేయిస్తే గొర్రెలు, మేకల ఎదుగుదలకు ఉపయోగకరంగా ఉంటుందని ఆయన పేర్కొన్నారు.

నిజాంసాగర్: మండలంలోని గాలీపూర్ గ్రామ పంచాయతీలో సర్పంచ్ లక్ష్మా రెడ్డి ఆధ్వర్యంలో గొర్రెలు, మేకలకు నట్టల నివారణ మందు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మండల పశు వైద్యాధికారి సయ్యద్ యూనుస్, సిబ్బంది నారాయణ, గోపాల మిత్ర రఘు పాల్గొన్నారు.

మద్నూర్: గొర్రెలు, మేకలకు నట్టల నివారణ మందులు వేయించుకోవాలని మేనూర్ పశు వైద్యాధికారి బండివార్ విజయ్ సూచించారు.

ఆధ్యాత్మికం

రేణుకాదేవి ఆలయంలో షబ్బీర్ అలీ పూజలు



మాచారెడ్డి: మండలంలోని భవానీపేట గ్రామంలోని రేణుకా ఎల్లమ్మ ఆలయ పునర్నిర్మాణ కార్యక్రమంలో భాగంగా చేపట్టిన ఉత్సవాల్లో భాగంగా బుధవారం కాంగ్రెస్‌కు చెందిన మాజీ మంత్రి షబ్బీర్ అలీ పూజలు నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అమ్మవారు అందరినీ చల్లగా చూడాలని కోరుకున్నట్లు తెలిపారు. ఆయన వెంట ఆ పార్టీ మండల అధ్యక్షుడు గనేశ్‌నాయక్, నాయకులు భీంరెడ్డి, లక్ష్మారెడ్డి, నాసీలాల్, లింగారెడ్డి తదితరులు ఉన్నారు.

ముగిసిన అఖండ హరినామ సప్తాహం



పెద్దకొడప్‌గల్: మండలంలోని కాటేపల్లిలో బుధవారం అఖండ హరినామ సప్తాహం కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. కాస్లాబాద్ విఠల్ మహరాజ్ అధ్వర్యంలో ఎడు రోజుల పాటు పలు కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులు పెద్ద ఎత్తున కార్యక్రమాల్లో పాల్గొన్నారు.

పెరుమాండ్లకు ఘనంగా పూజలు



భిక్కనూరు: మండల కేంద్రం సమీపంలోని అటవీ ప్రాంతంలో ఉన్న లోంక పెరుమాండ్ల ఆలయంలో బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించి పంచామృతాభిషేకం చేశారు. హనుమాన్ గురుస్వామి కుర్రి లింబాద్రి ఆధ్వర్యంలో పూజలు చేశారు.

నేటి నుంచి వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు

బాన్సువాడ రూరల్: మండలంలోని తిర్మలాపూర్ గ్రామం శ్రీ పద్మావతి సమేత శ్రీలక్ష్మి వేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు గురువారం నుంచి నిర్వహిస్తున్నట్లు ఆలయ ధర్మకర్త తుప్రాన్ శంకర్‌గౌడ్ తెలిపారు. 24న కల్యాణ మహోత్సవం ఉంటుందని తెలిపారు.

నేడు పుత్ర కామేష్టి యాగం

కామారెడ్డి అర్బన్: కామారెడ్డి తూర్పు హౌసింగ్ బోర్డు కాలనీలోని శ్రీసంకష్టహార గణపతి దేవాలయంలో గురువారం సామూహిక పుత్ర కామేష్టి యాగం నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ ప్రతినిధులు తెలిపారు. ఇతర వివరాలకు 88852 99917 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

సంక్షిప్తం

విద్యార్థులు మానసిక ఒత్తిడికి గురికావద్దు

సదాశివనగర్: పరీక్షల సమయంలో మానసిక ఒత్తిడికి గురికావద్దని జిల్లా మానసిక వైద్యాధికారి రమణ విద్యార్థులకు సూచించారు. బుధవారం స్థానిక మోడల్ స్కూల్‌లో మానసిక సమస్యలపై అవగాహన సదస్సు నిర్వహించారు. పీహెచ్‌సీ వైద్యాధికారిణి ఆస్మా, ప్రిన్సిపల్ భానుమతి, సోషల్ వర్కర్ రాహుల్ కుమార్ పాల్గొన్నారు.

నల్లధనంపై హామీ ఏమైంది?

కామారెడ్డి టౌన్: విదేశాల్లో దాచిన నల్లధనంపై ప్రధాని మోదీ ఇచ్చిన హామీ ఏమైందని డీసీసీ అధ్యక్షుడు కైలాస్ శ్రీనివాసరావు ప్రశ్నించారు. ఈమేరకు ఆయన బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. దేశ ఖజానాను ప్రధాని అదానికి దోచి పెడుతున్నారని ఆరోపించారు.

చెక్కుల పంపిణీ

బాన్సువాడ రూరల్: మండలంలోని వివిధ గ్రామాల లబ్ధిదారులకు మంజూరైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి పంపిణీ చేశారు. ఆర్డీవో రాజాగౌడ్, తహసీల్దార్ గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

పంటల పరిశీలన

రాజంపేట: మండలంలోని శివాయిపల్లిలో వ్యవసాయ శాస్త్రవేత్త రవి శంకర్ ఆధ్వర్యంలో వరి, మొక్కజొన్న, కూరగాయాల పంటలను పరిశీలించారు. కార్యక్రమంలో సర్పంచ్ విఠల్‌రెడ్డి, ఏఓ జ్యోత్స్న, ఏఈవో మన్యూష పాల్గొన్నారు.

ఇష్టపడి చదవాలి

ఎల్లారెడ్డిరూరల్: విద్యార్థులు ఇష్టపడి చదవాలని ఎంఈవో వెంకటేశం సూచించారు. ఎల్లారెడ్డి జెడ్పీ బాలికల ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు ప్రేరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు వనజ, రాజ్యలక్ష్మి పాల్గొన్నారు.

శివాజీ మహారాజ్ శోభాయాత్ర

మద్నూర్: మండల కేంద్రంలో బుధవారం ఛత్రపతి శివాజీ మహారాజ్ సార్వజనిక్ ఉత్సవ్ కమిటీ ఆధ్వర్యంలో శోభాయాత్ర నిర్వహించారు.

సిమెంట్ రోడ్డు పనులు ప్రారంభం

రాజంపేట: మండలంలోని పొందుర్తిలో బుధవారం సీసీ రోడ్డు పనులను సర్పంచ్ పని గంగకిషన్ ప్రారంభించారు. ఉప సర్పంచ్ మంజుల, ఎంపీటీసీ బాల్రాజ్ గౌడ్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు భిక్యాజి బల్వంతరావ్ పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

నస్రుల్లాబాద్: దివ్యాంగులు స్వయం ఉపాధి కోసం ఆన్‌లైన్‌లో 28వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని ఎంపీడీవో సుబ్రమణ్యం కోరారు. బ్యాంకు లింకేజి లేకుండా రూ.50 వేలు ఆర్థిక సహాయంతో 25 యూనిట్లు, బ్యాంకు లింకేజీ రుణాలతో 3 యూనిట్లు కేటాయించినట్లు తెలిపారు.

అంత్యక్రియలకు బంధువులు దూరం

పిట్లం: మండలంలోని కిష్టాపూర్ గ్రామానికి చెందిన గంగవ్వ (68) అనారోగ్యంతో బుధవారం స్థానిక శాంతినగర్ కాలనీలో మృతి చెందింది. బంధువులు ఎవరూ ముందుకు రాకపోవడంతో పిట్లం సర్పంచ్ జొన్న విజయరెడ్డి భర్త జొన్న శ్రీనివాస్‌రెడ్డి సహకారంతో అంత్యక్రియలు నిర్వహించారు.

పోలీసులపై చర్యలు తీసుకోవాలి

భిక్కనూరు: ఆస్పత్రుల్లో వసతులపై సీఎంవో కార్యదర్శి స్మిత సబర్వాల్‌కు విన్నవిస్తున్న బీఎస్పీ నాయకుడు శ్రీధర్‌రెడ్డిపై దాడి చేసిన పోలీసులపై చర్యలు తీసుకోవాలని ఆ పార్టీ మండల అధ్యక్షుడు రవీందర్ డిమాండ్ చేశారు.

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
కామారెడ్డి & ఎల్లారెడ్డి
96034 62494
99122 20764
Office mail : nzbadvt@gmail.com

సాక్షి పాఠక మహాశయులకు విజ్ఞప్తి
మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నంబర్లకు ఉదయం 7.00 గం॥ల నుండి రాత్రి 8.00 గం॥ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును.
యం. మధుసూదన్ (ACO) : 9951027699
ఎల్లారెడ్డి: డి.యల్.ఎస్. గౌడ్ : 9573130288
టోల్ ఫ్రీ నెం. 1800 425 9899